# 24. మధ్యవర్తిత్వం

రామ్మూర్తీ ఇందిరా హఠాత్తుగా మా ఇంటికి వచ్చారు. ఇద్దరూ దంపతులే అయినా, ఇద్దరూ కలిసి ఒకే జట్కాలో వొచ్చినా, ఇద్దరి ముఖాల్లోనూ విసుగుదలా, ద్వేషభావమూ స్పష్టంగా కనిపిస్తున్నయ్. తీవ్రసమస్య ఏదో ఇద్దర్నీ దూర దూరాన ఉంచినట్టు తోస్తుంది.

వొచ్చీ రావటంతోనే తాము చుట్టపు చూపుగా మా ఇంటికి రాలేదని స్పష్టంగా చెప్పదలచుకున్నట్టు - తమ సంభాషణను మొదలుపెట్టారు.

ఇందిర నాకు మరదలు, రామ్మూర్తి నాకు పినతండ్రి కొడుకు. వీళ్ళ కాపరం మొదలై ఆరునెలలన్నా కాలేదు - అప్పుడే వీళ్ళకొక సమస్యా అనిపించింది నాకు.

చూడబోతే విషయం అతిసామాన్యమైనది. మా మావగారికి ఇద్దరే ఆడపిల్లలు. వారి తాలూకు ఆస్తి ఒకనలభై వేలు ఇందిరపేర ఉంది. ఆ ఆస్తిని తనకురాసి ఇస్తే ఆ పెట్టుబడితో వ్యాపారం సాగిస్తానని రామ్మూర్తి అంటాడు. ఇందిర దీన్ని ఒప్పుకోవటం లేదు. అదీ విషయం.

"యీ ఉన్న ఆస్తి కాస్తా వ్యాపారంలో పాడైందంటే ఇంక అడుక్కుతినాల్సిందేకదా" అంటుంది ఇందిర.

"ఎందుకు పోతుందీ? నాకేమన్నా దురభ్యాసాలున్నాయా? ఇప్పుడు పొగాకు వ్యాపారం మంచి ఛాన్సుగా ఉంది. పెద్ద పెట్టుబడితో వ్యాపారం చేస్తే ఉన్న ఆస్తిని పెంచుకోవచ్చు" అంటాడు రామ్మూర్తి.

'ఇప్పుడున్న దాంతో దిగుల్లేకుండా జీవితం గడుస్తోంది. వ్యాపారం అనగానే లాటరీలాటిది. లాభం తీసేందుకు ఎంత అవకాశం వుందో, నష్టపోయేందు క్కూడా అంత అవకాశమూ వుంది...."

ఇందిరమాట పూర్తికాకముందే రామ్మూర్తి ఛర్రున లేచాడు.

"మొగాణ్ణి గోళ్ళుగిల్లుకుంటూ ఇంట్లో కూర్చుంటానా యేం? ఎంత ఆస్తివున్నా సోమరితనంతో కుళ్ళిపోనా? నువ్వు చెప్పు అన్నయ్యా?" అన్నాడు.

"ఉద్యోగం చెయ్యొద్దని అన్నానా బావా?" అంది ఇందిర.

"బోడి ఉద్యోగాలు. ఒకడి కింద పడి వుంటానా? స్వతంత్రంగా బతకాలి గాని" అన్నాడు రామ్మూర్తి.

"నాకు ఆస్తి ఉండటమే నా నేరం" అంది ఇందిర.

"ఆడదాని డబ్బు తింటూ నేను బతకలేను" అన్నాడు రామ్మూర్తి.

"ఉన్న ఆధారాన్ని మాత్రం నేను వొదులుకోను" అంది ఇందిర.

"నా మాట వినని భార్య నా కసలు అక్కర్లేదు" అన్నాడు రామ్మూర్తి.

ఈ విషాద ఘట్టంలో ఇద్దరూ ఆగిపొయ్యారు. వాళ్ళిద్దరూ ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోవటంలేదు. కోర్టులో ముందు వాదించుకునే ప్లీడర్లను జ్ఞాపకం చేసింది - వాళ్ళ సంభాషణ. ఈ విషయంలో వాళ్లు ధాటిగా, ఎక్కడో బాగా కంఠస్థం చేసిన పాఠాన్ని అప్పగించినట్టు మాట్లాడటం చూసి యీ రంగం ఇదివరకు చాలాసార్లు అయివుంటుందని నాకు బాగా అర్థమయింది.

"ఇది మాకు తేలేట్టులేదు. నువ్వే తేల్చు అన్నయ్యా" అన్నాడు రామ్మూర్తి.

"నా వెనుక పెద్దవాళ్ళెవరూ లేరు. నువ్వు చెప్పినట్టు నడుచుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నాను" అంది ఇందిర.

నాకుమాత్రం గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది. ఇందిర వైపు మాట్లాడితే "భార్యచెల్లెలనే అభిమానం చూపాడు" అని రామ్మూర్తి అంటాడు. రామ్మూర్తి పక్షాన మాట్లాడితే - పినతండ్రి కొడుకనే అభిమానం చూపాననీ, పాడు మొగజాతి అంతా ఒక్కటే మచ్చు అని ఇందిర అంటుంది. పోనీ పక్షపాతం లేకుండా న్యాయాన్ని పాటిద్దామా అంటే - ఇందులో ఏది న్యాయమో నా బుద్ధికి తోచలేదు.

ఆస్తి రాసిమ్మని ఇందిరను ఒప్పిస్తే-? నిన్నకాక మొన్న కాలేజీ చదువునుంచి బైటపడ్డ రామ్మూర్తి బుర్రలో భూలోకంలో తీరని ఆశలెన్నో గూడుకట్టుకొని ఉండటం సహజంకాదు. తీరా అవి చేతలుగా మారినప్పుడు ఇందిర అన్నట్టు కథంతా అడ్డుతిరిగితే - అప్పుడు యీ నింద నా మీద పడుతుంది.

పోనీ రామ్మూర్తిని ఇందిర చెప్పినట్టే ఉండమంటే? "నీ సంగతేమిటి?" అంటాడేమో? నిజానికి నా భార్య తన ఆస్తిని నా పేర రాసింది. ఐతే నేనామెను బాధించలేదు. ఒక సుందర దృశ్యాన్ని సృష్టించనూలేదు...అదంతా వివరంగా చెప్పినా రామ్మూర్తి నమ్మడు. తన పురుషత్వం ముందు ఇందిర అబలత్వాన్ని లెక్కచేసే స్థితిలో అతను లేడు. తన ఇష్టానుసారంగా ఇందిర నడచుకోకపోతే – ఇందిర తనకు అక్కర్లేదనే మాటకూడా అన్నాడు. యీ కొత్త దాంపత్యంలో ఇద్దర్లో ఏ ఒక్కరు అపార్థం చేసుకున్నా మొత్తం తలకిందులౌతుంది. వాళ్ళ యువకరక్తం పట్టుదలను రెట్టించటం వల్ల ఒకరినొకరు లెక్క చెయ్యకుండా, ముందువెనుకల ఆలోచన లేకుండా ఇంతలో విడిపొయ్యారంటే పండంటి కాపరం కాస్తా పాడౌతుంది. కేవలం పట్టుదలకోసం రామ్మూర్తి నిజంగానే ఇందిరను వొదిలిపెడితే? యీ సమాజంలో తరవాత తన స్థానం యేమిటో తెలుసుకోలేని ఇందిర ఇప్పుడు నవ్వి ఊరుకోవచ్చు. ఆ తరువాత పశ్చాత్తాప పడాల్సిందీ, ఆ శిక్షను అనుభవించాల్సిందీ ఇందిరే అవుతుంది. ఆ సమయంలో ఆమెకు మేమెవరం సహాయం చేయలేం! యీ సమాజంలో రామ్మూర్తి పురుషత్వపు హక్కుల్ని ఉపయోగించుకునే అవకాశం వుంది, కాని ఇందిర అన్యాయమై పోతుంది–

నాకెందుకు లెమ్మని ఊరుకుందామా అంటే – నన్నొక అసమర్థుడిగా ఎంచి – ఆ మాటను ఇద్దరూ నా మొహానే అని ఇంకో మధ్యవర్తి దగ్గరకు వెళ్తారు. ఆ విధంగా వంశగౌరవం బజారుపాలుగాక తప్పదు. యీ సమస్య ఇంకా భయంకర రూపం దాల్చకముందే దీన్ని ఛేదించవలసిన నా బాధ్యతను గుర్తించాను.

బాగా ఆలోచించి చెప్పేందుకు ఇద్దరూ కూడా తగినంత వ్యవధి ఇవ్వటంలేదు. యీ గొంతుమీది కత్తిని తప్పించుకునేందుకు తాతలు దిగివొచ్చేట్టున్నారు.

వీళ్ళ తగూ ప్రారంభమై రెండు వారా లైందనీ, ఇద్దరూ గోడలతోనూ దర్వాజాలతోనూ మాట్లాడుకోవటమే కాని ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోవటం లేదనీ తేలింది. మర్నాటికి వాయిదావేసి, ఎడమొగం పెడమొగంగా వున్న యీ దంపతుల్ని బతిమాలి, భంగపడి ఎలాగో భోజనానికి తీసుకు వెళ్ళగలిగాను.

భోజనాలయాక రామ్మూర్తి మేడమీదికి వెళ్ళి పడుకున్నాడు. ఇందిర సావిట్లో పడుకుంది. వీళ్ళ పిచ్చిపట్టుదలకు నాకు నవ్వొచ్చింది.

ఆ రాత్రి "ఏం చేసేట్టూ?" అన్నాను మా ఆవిడతో.

"మీరు చేయగలిగిందేమీలేదు. మాట్లాడకుండా ఊరుకోండి" అందామె.

"ఊరుకుంటే చాలాదూరంపోతుంది. వాళ్ళు మన మీద ఇంత ఆశపెట్టుకొని వచ్చాక...?"

ఆమె అంది "అదా మీ ధీమా? ఇలాటి విషయాల్లో ఆ అహం చంపుకోవాలి."

"వంశ గౌరవం పోతే అందులో మనక్కూడా భాగం ఉంటుందని తెలుసా?" అన్నాను.

"ఒక్కటి ఆలోచించండి. వాళ్ళిద్దరూ మిమ్మ్మ అడిగి పోట్లాడుకోలేదు. అలాగే మీ సహాయం లేకుండానే ఏకమౌతారు" అందామె.

ఆమె సలహా నాకేమీ రుచించలేదు. ఏమీ చేతకాని వాడిలా ఊరుకునేదా?

"అంత చిన్నవిషయంలో వాళ్ళు ఈ ఆపదలో పడకుండా ఏదోవిధంగా వాళ్ళను గట్టెక్కించాల్సిందే" అన్నాను.

"వాళ్ళు మీ సహాయానికి వస్తే - మీరు నా సలహాకు వచ్చారు. అంతేగా? భార్యాభర్తల తగాదాలకు ఎంతకావాలీ? మళ్ళీ రాజీపడటం ఎంతసేపు?" అందామె నవ్వుతూ.

నాకు కోపం వొచ్చింది. నా భార్య నాకు సహాయం చెయ్యకపోగా, నేను తన సలహా అడిగానని, నన్ను చులకనగా చూస్తున్నట్టు తోచింది.

"నీ సహాయం నాకేమీ అక్కర్లేదు.... ఊరుకుందూ" అన్నాను విసుగ్గా.

"అడిగారు కనుక చెప్పాను. అంతమాత్రానికే మీకింత కోపం రావాల్సిన సందర్భం నాకేమీ కనిపించటంలేదు" అందామె.

"నీమాత్రం తెలివితేటలు నాకు లేకపోలేదు. ఇంత చిన్న విషయంలో తీర్పు చెప్పలేనంత అసమర్థుణ్ని కాదులే!" అన్నాను మరింత విసుగుతో.

"తీర్పు! మీ ఇష్టం వొచ్చినట్టు తీర్పు చెప్పి ఇందిరకు అన్యాయం చేసేందుకు నేను ఒప్పుకోను" అందామె.

"అన్యాయం ఏముందీ? ఆడది ఏ విధంగా తన ఆస్తిపాస్తుల్ని చక్కబెట్టుకో గలదూ?" అన్నాను.

"నాలాగు అదేమీ చదువుకోని మొద్దుకాదు. దానికి అన్నీ తెలుసు. నిన్న కాక మొన్ననే కాలేజీనుంచి వొచ్చి - మన్నూమిన్నూ తెలియకుండా ఎగిరిపడే రామ్మూర్తి సంగతి నాకు చెప్పనక్కర్లేదు."

"చెల్లెల్ని వెనకేసుకొస్తున్నావ్" అని హెచ్చరించాను.

"మీరో! తమ్ముణ్ణి వెనకేసుకొని రావటంలా?" అని ఆమె రెట్టించింది.

నాకు వొళ్ళుమండింది. ఆమెను కోప్పడ్డాను. ఆమె కష్టపడే మాటలెన్నో అన్నాను. ఆమె ఊరుకోలేదు. ఇందిర పక్షాన వాదించింది. తప్పనిసరిగా నేను రామ్మూర్తివైపు మొగ్గాను. ఇద్దరి మధ్యా క్షణంలో విరోధభావాలు చెలరేగినయ్. ఇంతవరకూ మా జీవితంలో ఎరగనంత ఘాటుగా పోట్లాడుకున్నాం. ఏ విధంగా అది ఇంతదూరం వొచ్చిందో నేనిప్పుడు చెప్పలేను...

ఆమె వెళ్ళి చెల్లెలు దగ్గర పడుకుంది. ఎందుకు వెళ్ళినా – తుఫాను ఆగినట్టయింది. ఆ మిగతారాత్రి నా స్వంత ఆలోచనలతోనే గడిపాను.

తెల్లారగానే మా ఆవిడ నా మీద సమ్మె ప్రారంభించిందని తెలుసుకునేందుకు ఎక్కువసేపు పట్టలేదు. నేను మాట్లాడటం లేదు. ఇంకోదారి లేక ఇందిరను ఉద్దేశించి ఆమెతో మాట్లాడాల్సి వొచ్చింది. అతిస్వల్పవిషయం మా ఇద్దర్నీ ఇంత దూరానికి నెట్టినందుకు ఎంతో ఖిన్నుణ్ణయాను.

ఇందిరా రామ్మూర్తీ నా తీర్పుకోసం ఆతృతతో ఎదురు చూస్తున్నారు. నా భార్యకూ నాకూ పడటంలేదు. నేను ఏమని తీర్పు చెప్పి యీ దంపతుల్ని కలిపేది? నా సమస్యే నాకు తేలకుండా వుందాయె. ఏ కాస్త ఎగుడుదిగుడు వొచ్చినా యీ నిందంతా నా నెత్తినే పడేట్టుంది.

ప్రస్తుతం ఇంటిలోనుంచి దాటుకోవటం అత్యుత్తమంగా తోచింది – 'ఇప్పుడే వస్తాను' అని ఎలాగో బైటపడ్డాను.

సరైన ఆలోచన వొచ్చేదాకా ఇంటికి పోకూడదని నిశ్చయించుకున్నాను. రాత్రి ఏడింటిదాకా క్లబ్‌లోనే కూర్చున్నాను. బుర్ర మొద్దుబారటం తప్ప ఇంకేమీ జరగలేదు. ఇంటికివెళ్ళి భార్యతో పోట్లాడేందుక్కానీ, ఇందిరా రామ్మూర్తీ చూసే ఆత్రపు చూపుల తాకిడిని తట్టుకునేందు క్కానీ నాకు మనస్కరించలేదు.

ఒక్కణ్ణీ సినిమాకు వెళ్ళాను. చాలాసేపటి కిందే అది ప్రారంభం కావటంవల్ల, చీకట్లో తడుముకుంటూ వెళ్ళి కుర్చీలో కూలబడ్డాను.

త్వరలోనే ఇంటర్ వల్ అయింది. నా ముందు వరుసలో సరిగ్గా నాకు ముందరగా – రామ్మూర్తీ ఇందిర కూర్చున్నారు. వాళ్ళను చూసేప్పటికి నన్నెక్కడ గుర్తుపడతారోనని కుర్చీలో ముడుచుకు కూర్చుని మొహానికి గుడ్డ అడ్డం పెట్టుకున్నాను.

వాళ్ళిద్దరి ముఖాల్లోనూ విరోధ భావాలే లేవు! ఎంతో సంతోషంగా ఉన్నారు. రెండు డ్రింకులు గడగడా తాగారు. రామ్మూర్తి ఆమెతో ఏదో రహస్యంగా చెప్తున్నాడు. హాలంతకూ కొత్తకాంతి వొచ్చేట్టుగా ఇందిర కిలకిల నవ్వుతోంది. వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో వినేందుకు నేను ప్రయత్నించలేదు. ఆ ప్రయత్నంలో వాళ్ళు నన్ను గుర్తుపడతారేమోనని నా భయం. అసలు వాళ్ళిలా కలిసిపోవటం చూస్తే ఆశ్చర్యంతో నన్ను నేనే మరిచిపొయ్యాను.

వీళ్ళను ఏ ఆకర్షణశక్తి మళ్ళీ జత చేసిందో! వాళ్ళు దంపతులు కావటమే కారణమా? ఏ విధంగా రాజీపడి ఉంటారో నాకు అంతు పట్టటంలేదు. ఇందిర ఆస్తి రాసి ఇచ్చేందుకు ఒప్పుకుందా? రామ్మూర్తి ఇందిర మాటలను విన్నాడా? అసలు ఎలా కలిశారో వాళ్ళకే తెలియదేమో! అంతఘోరంగా పోట్లాడుకోవటంవల్లనే ఇద్దరూ

ఇంతదగ్గరయ్యారేమో? చూడబోతే దాంపత్యంలోని ఎగుడుదిగుళ్ళు కూడా ఒకందుకు మంచివే నేమోననిపిస్తుంది.

చప్పున మా ఆవిడ మాటలు జ్ఞాపకం వొచ్చినయ్. భార్యాభర్తలు పోట్లాడు కునేందుక్కానీ, తిరిగి కలిసేందుక్కానీ ఎంతో సేపు పట్టదని రాత్రి ఆమె నాతో అన్నది. అంతే ఐవుంటుంది. వాళ్ళ కలయికకు ఎవరూ బాధ్యులు కారేమో?

నేను ఏమాత్రం తొందరపడి ఏ తీర్పు చెప్పినా - దూముడల్లా పీటముడిగా మారేది. వేళా విశేషంవల్ల నా కుశాగ్ర బుద్ధికి యేమీ తోచకపోవటం ఎంతో మంచిదయింది.

వీళ్ళమూలానే రాత్రి నేనూ నా భార్యా పోట్లాడుకున్నాం. వీళ్ళిద్దరూ కలవనే కలిశారు. ఇక మా దంపతుల మధ్య విరోధ భావం ఉండటం హాస్యాస్పదం. దంపతులమధ్య రేకెత్తిన తగూలు ఎంతోకాలం ఉండేవి కావన్న సంగతి రామ్మూర్తికీ ఇందిరకూ తెలుసో లేదో కాని - నా భార్యకు మాత్రం బాగా తెలుసు. ఇక నాకు వీళ్ళిద్దరికన్నా ప్రత్యక్ష నిదర్శనం ఇంక ఏం కావాలీ?

సినిమా చూసి వీళ్ళిద్దరూ ఇంటికి వొచ్చే లోపల తెలివిగా మా ఆవిడతో రాజీపడదామనే ఆశతో - బండేమీ దొరక్కపోయినా, ఆ చీకట్లో అడ్డదార్లపడి వడివడిగా నడవసాగాను.

*- డిసెంబర్ 1947*